క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

కృష్ణా: మండలంలోని కృష్ణానది నుంచి ఎలాంటి అనుమతి లేకుండా గుడెబల్లూర్ గ్రామానికి చెందిన వెంకటేష్, సురేష్ రాత్రి తమ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని వాటిని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్‌ఐ ఎండీ నవీద్ కేసునమోదు చేసినట్లు చెప్పారు. మండలంలోని అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు సుదర్శన హోమం

మరికల్: వైకుంఠ ఏకదాశి సందర్భంగా మండలంలోని చిత్తనూర్ శివారులోని రామాలయంలో ఈ నెల 10న సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి లక్ష్మీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి హోమంలో పాల్గొనాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కొత్తపల్లి: ఇటీవల గుండె పోటుతో మృతిచెందిన ఎక్కామేడ్ మాజీ సర్పంచ్ అల్లిపురం నర్సప్ప కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బుధవారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అలాగే మండలంలోని భూనీడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మహిపాల్ గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నాయకులు సలీం, బాల్‌రెడ్డి, గోపాల్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లి, బిడ్డ క్షేమం

కొత్తపల్లి: మద్దూరు మండలంలోని పెద్ద తండాకు చెందిన మనీషా అనే మహిళకు పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారాన్ని అందించారు. మనిషాను అంబులెన్స్‌లో పేట ప్రభుత్వ దవాఖానకు తరలిస్తున్న క్రమంలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. మనిషా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు. తమ బిడ్డకు ప్రసవం చేసిన 108 అంబులెన్స్ సిబ్బంది తాజుద్దీన్, పైలెట్ ఫయాజ్ ఖాన్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యుడికి సన్మానం



దామరగిద్ద: భీష్మరాజ్ ఫౌండేషన్ సేవలను మరింతగా విస్తరిస్తామని సభ్యుడు గడ్డం తిప్పన్న, వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని మైసమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు తిప్పన్న, వెంకటేష్, సంతోష్, మధుసూదన్ రెడ్డి, మోహన్, శరణ్‌దాస్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నారాయణ పేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ... ప్రజాపాలనతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత కరువైందని, మెనూ ప్రకారం ఆహారం అందిచడం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వప్న, తార, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు వినతి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని వివిధ విద్యాసంస్థలకు వచ్చే గ్రామీణ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ బస్సులను సమయానుకూలంగా నడిపించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ డీఎం లావణ్యను కలుసుకొని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, విష్ణు, అశోక్, మోహన్, అజయ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు తాగునీటి కష్టాలు

- నిరుపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్లు
- పట్టించుకోని అధికారులు

ఊట్కూర్: విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించాలని పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థలు అందించిన మినిరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. మండలంలోని పెద్దజట్రం ఉన్నత పాఠశాల, ఊట్కూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలకు నందీ ఫౌండేషన్ తదితర స్వచ్ఛంద సంస్థలు 10ఏళ్ల క్రితం మినిరల్ వాటర్ ప్లాంట్ అందజేశారు. ప్లాంట్ ద్వారా సుమారు 5 ఏళ్లపాటు విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు లభించింది. ప్లాంట్‌లో ఏడాదికి ఒకసారి క్యాండిల్స్‌తో పాటు తదితర సామగ్రిని మార్చవలసి ఉంటుంది. సుమారు రూ. 50 వేల వరకు ఖర్చు అవుతుండడం, నిధుల లేమి కారణంగా అధికారులు ప్లాంట్ నిర్వహణ పక్కన పెట్టేశారు. దీంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు.



పెద్దజట్రం పాఠశాలలో నిరుపయోగంగా వాటర్ ప్లాంట్ ఇలా..

భగీరథ నీరే దిక్కు..

పెద్దజట్రం ఉన్నత పాఠశాలలో 286 మంది, ఊట్కూర్ బాలికల ఉన్నత పాఠశాలలో 215 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫిల్టర్ నీరు లేక పోవడంతో మిషన్ భగీరథ నీటిని విద్యార్థులు తాగుతున్నారు. స్వచ్ఛమైన నీరు అందక అప్పుడప్పుడు అస్వస్థతకు గురువుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌కు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.



ఊట్కూర్ బాలికల ఉన్నత పాఠశాలలో ..

స్వచ్ఛమైన నీరు అందించాలి..



పాఠశాలలో మినిరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతుకు నోచుకోక నిరుపయోగంగా ఉంది. పాఠశాలకు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటిని తాగుతున్నాం. అధికారులు స్పందించి ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టాలి. పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మోహన్, 9వ తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దజట్రం

ఉన్నతాధికారులకు నివేదించాం..



వాటర్ ప్లాంట్ మరమ్మతు నోచుకోక నిరుపయోగంగా మారింది. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ప్రభుత్వం ద్వారా నిధులు వచ్చిన లేక ఎవరైన దాతలు ముందుకొచ్చిన వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందజేస్తాం.

– మాధవి, హెచ్‌ఎం బాలికల ఉన్నత పాఠశాల, ఊట్కూర్

రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలి

నారాయణపేట: ప్రభుత్వ పాఠశాలల్లో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలను చివరగా ఏ అధికారి విజిట్ చేశారని హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. చివరగా ఎంపీడీఓ పాఠశాలను విజిట్ చేసినట్లు తెలుసుకున్న కలెక్టర్ విజిటర్ రిజిస్టర్‌ను చూశారు. కానీ అందులో ఎంపీడీఓ విజిట్ చేసినట్లు సంతకం లేకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరైనా జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాఠశాల విజిట్‌కు వస్తే వారితో రిజిస్టర్‌లో సంతకాలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూసిన తర్వాత భోజనం ఎలా ఉందో రిమార్క్‌ను రిజిస్టర్‌లో రాయాలన్నారు. గుడ్, యావరేజ్, నార్మల్ ఇలా మూడు రకాల అభిప్రాయాలను తప్పనిసరిగా రాస్తేనే మరుసటి రోజు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటారని చెప్పారు.



రిజిష్టర్‌ను తనిఖీచేస్తున్న కలెక్టర్

అనంతరం పాఠశాలలో బియ్యం బస్తాలను కలెక్టర్ పరిశీలించారు. బియ్యం, వంటకు వినియోగించే సరకులను నిల్వ ఉంచే గది ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. గత నెల బియ్యం స్టాక్ ఎప్పుడూ వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. మొత్తం పాఠశాల విజిట్లకు సంబంధించిన అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించి, పూర్తిస్థాయిలో రిపోర్ట్ ఇవ్వాలని డీఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ సునీత, భోజన నిర్వహణ సమన్వయకర్త యాదయ్య శెట్టి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై కళా ప్రదర్శన



భద్రత నియమాలపై వివరిస్తున్న కళాకారులు

నారాయణపేట: కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు ఆర్‌టీఓ మేఘా గాంధీ సహకారంతో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సూచనల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బుధవారం ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, రోడ్డు ప్రమాదాలపై కళాకారులు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్టు వేసుకోవాలని వాహనానికి సంబంధించి సరైన ధ్రువపత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని తెలియజేశారు. ఆర్‌టీఓ మేఘాగాంధీ, కళాకారులు రవిశంకర్, కిరణ్, ఎర్ర నర్సింహ, బాలయ్య, చల్లా లక్ష్మి, అరుణ, సుగుణ, రాధా, జ్యోతి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కృష్ణా: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికిల్స్ ఇన్స్‌స్పెక్టర్ రుబీన ప్రవీన్ సూచించారు. బుధవారం మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీచేయడంతోపాటు ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. ప్రయాణికులు సీట్‌బెల్టు, హెల్మెట్ ధరించాలని, నియమిత వేగంతో ప్రయాణించాలన్నారు. అలాగే మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎస్‌ఐ ఎండీ నవీద్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. రఘుబాబు, ఇతర ఆర్టీఓ అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

దుండగులను కఠినంగా శిక్షించాలి



మక్తల్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు

మక్తల్: కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం అప్రజాస్వామికమని, వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా బుధవారం మాగనూర్‌లో రాస్తారోకో చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. గాంధీ భవన్‌పై బీజేపీ అల్లరి మూకలు మూకుమ్మడిగా దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాసాగర్, శ్రీనివాసులు, నారాయణ, జయనంద్‌రెడ్డి, తిమ్మప్ప, అశోక్‌గౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడడం హేయమైన చర్య

కృష్ణా: బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ విద్యాసాగర్ అన్నారు. బుధవారం ఆయా మండలాలకు చెందిన పార్టీ నాయకులు మాగనూర్‌లోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కనకరాజు, జయనాంద్‌రెడ్డి, నారాయణ, శ్రీనివాసులు, అశోక్‌గౌడ్, నర్సప్ప, రాఘవేంద్ర, లింగప్ప, వెంకటప్ప, ఆంజనేయులు, పురుషోత్తం రెడ్డి, భరత్‌కుమార్ పాల్గొన్నారు.



దామరగిద్దలో మాట్లాడుతున్న నాయకులు

దాడి చేయడం అప్రజాస్వామికం

దామరగిద్ద: కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం అప్రజాస్వామికమని బీజేపీ మండల అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: పార్టీ కార్యాలయంలో పై ఇలాంటి దాడులు సరికాదని మండల బీజేపీ అధ్యక్షుడు భవాని శంకర్ హెచ్చరించారు. రాజుగౌడ్, భాస్కర్ రెడ్డి, వెంకటయ్య, రవి, భరత్, రఘు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



మద్దూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయిలో జరిగిన బాలుర ఖోఖో విభాగంలో బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న రాజశేఖర్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నుంచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు, సూర్య ప్రకాష్, వసంత కుమార్, వనజ, శారద పాల్గొన్నారు.

ఐక్యవేదిక కార్యనిర్వాహణ అధ్యక్షుడికి సన్మానం

దామరగిద్ద: మండలానికి చెందిన గ్యాంగ్ హన్మంతు తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్య వేదిక కార్యనిర్వహణ అధ్యక్షుడిగా ఎన్నికైనందున స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ భీమయ్యగౌడ్ ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించడం పట్ల జాతీయ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

యువక మండలి అధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డి

మరికల్: యువక మండలి అధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యువక మండలి భవనంలో అఖిల పక్షం పార్టీల నాయకులు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డిని యువక మండలి అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు రవికిరణ్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

నారాయణపేట: వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీని.. యావత్ దేశ మహిళలను అగౌరపరిచేలా బీజేపీ నాయకులు రమేష్ బిరుది మాట్లాడడం సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో బీజేపీ నాయకుడి వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా చేసి మాట్లాడారు.. సిద్ధాంతాలపై మాట్లాడే బీజేపీ నాయకులు ఇలా దిగజారుడు హేళన చేస్తూ మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. హరిశ్వర్ రెడ్డి, వేణుగౌడ్, మహేష్ రెడ్డి, భాస్కర్, యూసుఫ్ తాజ్ తారక్, శీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణకు సన్మానం



మక్తల్: పాలమూరు ఎంపీ డీకే అరుణను మక్తల్ మండలం జక్లేర్ గ్రామానికి చెందిన నాయకులు శేఖర్ రెడ్డి, రంగారెడ్డి, అనంతరెడ్డి బుధవారం జిల్లా కేంద్రంలోని శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలని ఎంపీని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొత్తపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని భూనీడులో గ్రామ యువకుల ఆధ్వర్యంలో బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల మహేందర్‌రెడ్డి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 30జట్లు పాల్గొంటునట్లు, అలాగే గెలిచిన జట్టుకు రూ. 20116, రన్నర్ జట్టుకు రూ. 10116 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. నాయకులు నరేష్, సవారి శ్రీను, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు



ఊట్కూర్ పాఠశాలలో స్లిప్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని ఉర్దు మీడియం ప్రాథమిక పాఠశాల, బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం తాజా కూరగాయలతో ఆహారం వడ్డించాలని వంట సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ సుభాష్, హన్మంతు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నర్వ: మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన స్వచ్ఛమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఎస్‌ఓ శిరీష, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి కేజీబీవీ పాఠశాలను బుధవారం తహసీల్దార్ రవి తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల రికార్డులు, వంట గదిని, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సరుకులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కొత్తపల్లి: మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలను బుధవారం ఎంఈఓ బాలకిష్టప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించి, నాణ్యత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల హెచ్‌ఎం పావని పాల్గొన్నారు.

సబ్సిడీపై జీవన ఎరువు పంపిణీ

ధన్వాడ: నేలలో నిల్వ ఉన్న భాస్వరం ఎరువును కరిగించి మొక్కకు అందించే బ్యాక్టీరియా జీవన ఎరువు ప్యాకెట్లు సబ్సిడీ ధరకు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నవీన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సబ్సిడీపై వచ్చిన పీఎస్‌బీలను రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కిలో ఫాస్పెట్ సాలుబులైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) సబ్సిడీపై రూ. 20కి లభిస్తుందన్నారు. జీవన ఎరువులు సమర్థవంతగా పనిచేయాడానికి సేంద్రియ కర్బనం అవసరముంటుందని, రెండు కిలోల జీవ ఎరువును అందుబాటులో 100కిలో సేంద్రియ ఎరువుతో కలిపి వినియోగించడంతో భూమిలో పేరుకు పోయిన భాస్వరం (డీఏపీ) ఎరువును కరిగించి పంటకు అందిస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ సైమన్, రాజు రైతులు రహీమన్‌ఖాన్, సుధాకర్ రెడ్డి, లక్ష్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పీఎస్‌బీ అందజేస్తున్న ఏఓ నవీన్

సింగారంలో గ్రామసభ

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధి చెందే విషయంలో భాగంగా 9థీమ్స్‌ను సూచించి 2024–05 సంవత్సరంలో భాగంగా సంకల్ప్ కింద 2 థీమ్స్ ఎన్నుకుని వాటికి కేంద్రం నుంచి వచ్చే నిధులను 50 శాతం తగ్గకుండా ఖర్చు చేసి గ్రామాన్ని అభివృద్ధి పరుచుకోవాలని గ్రామ సభలో పేర్కొన్నారు. పచ్చదనం, పరిశుభ్రతతోపాటు మహిళ సాధికారత అభివృద్ధి, పనులకు పంచాయతీ తీర్మానం ద్వారా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వెంకటేశ్వర ప్రసాద్, ఎన్ఐఆర్డీ మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి

మాదాసి కుర్వలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మరికల్: మాదాసి కుర్వలకు ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు బండారి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎక్లాస్‌పూర్ బీరప్ప ఆలయంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.. వెంటనే ప్రభుత్వం స్పందించి తమను మాదాసిలుగా గుర్తించి ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, నరేందర్, నరేష్, మల్లప్ప, రాములు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

మక్తల్/ఊట్కూరు: మండలంలోని బీరలింగేశ్వర ఆలయం వద్ద బుధవారం మాదాసి కుర్వ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాదాసి కుర్వ సంఘం మక్తల్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు కుర్వ ఆశప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వం మాదాసి కుర్వలకు ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోవిందప్ప, ఆశప్ప, మోహన్, ఓబులాపురం అంజప్ప, వెంకటేష్, బీమప్ప, అశోక్ పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడి బాటలో నడవాలి..

నారాయణపేట ఎడ్యుకేషన్: పట్టణంలోని ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సింగర్‌బేస్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసినా ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ కార్యవాహ అయిన మ్యాడం ప్రభాకర్ మాట్లాడుతూ.. మన దేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత స్వామి వివేకానంద అని కొనియాడారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నరేష్, వెంకటేష్, ఇంతియాజ్, చరణ్‌రెడ్డి, ఓంకార్, సిద్దర్థ, అరవింద్, రాకేష్, అరుణ్ పాల్గొన్నారు.



కనుల పండువగా రథోత్సవం

ఊట్కూరు: మండలంలోని తిప్పరాస్‌పల్లిలో శ్రీ సద్గురు శరభలింగేశ్వరస్వామి రథోత్సవం బుధవారం కనుల పండువగా కొనసాగాయి. సాయంత్రం పూలతో రథాన్ని అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో గ్రామ శివారు వరకు లాగారు. వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. వెంకటయ్య, నర్సింహులు, రాములు, వెంకటప్ప పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

ఉల్లినారు ఎత్తుకెళ్లారు..

మరికల్: మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ. 50 పలకడంతో దొంగలు చివరి ఉల్లి నారును కూడా వదలడం లేదు. మండలానికి చెందిన రైతు మోహన్ రెడ్డి తన వ్యవసాయ పొలంలో ఉల్లినాటు కోసం నారు పోశాడు. నాటు వేసేందుకు ఉల్లినారు రావడంతో పొలం సిద్ధం చేశాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ మడిలో అడ్డగోలుగా పీక్కడంతో కొంత మేర నారు పాడై పోయింది. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతుకు నారు కన్పించకపోవడంతో చుట్టూ పక్కల పొలాల వద్ద ఉన్న రైతులతో ఆరా తీయగా.. తాము ఎవరూ తీసుకోలేదని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగాడు. దాదాపు రూ. 10 వేల విలువ చేసే ఉల్లినారును ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు తెలిపారు.

పర్యావరణహితంగా మెలుగుదాం..



పుడమిపత్రిక సంపుటిని ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

కోస్గి రూరల్: నిత్య జీవితంలో చేసే ప్రతి పనిని పర్యావరణ హితంగా ఉండేలా చేయడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చని యువ పుడమి నాయకుల సమన్వయకర్త వార్ల మల్లేషం అన్నారు. బుధవారం మండలంలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో యువపుడమి నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంచాలని గుర్తు చేశారు. అరుదైన మొక్కలు సంరక్షించాలని, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. అనంతరం పుడమి పత్రిక సంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.